# పెళ్ళిచూపులు



"ఇస్మాయిల్! నీకు చక్కని సంబంధం చూశాను" ఇంట్లోకి అడుగు పెడుతూనే అన్నాడు అహమద్.

"నాకా! ఎవరి పిల్ల?" అన్నాడు ఇస్మాయిల్ ఆశ్చర్యంతో.

"గుంటూరులో అబుల్ ఫజల్‌గారు లేరూ... ఆయన చిన్నమ్మాయి ఫాతిమా. వారికి బాగా నచ్చడంతో ఆనందం పట్టలేక వచ్చీరాగానే చెప్పేశారు."

తెచ్చిన అన్ని సంబంధాలకు వంకలు పెట్టే ఇస్మాయిల్ కనీసం ఈ సంబంధం అయినా ఒప్పుకుంటాడని వారు నమ్మకంతో ఉన్నారు.

"ఊ..! మీకు ఎంత నచ్చినా, నేను చూడందే చేసుకోను" అన్నాడు ఇస్మాయిల్.

"అదెలా వీలవుతుందిరా?! మన ముస్లిములలో పెళ్లిచూపులు ఉంటాయా? పెద్దలకి నచ్చిన సంబంధాన్నే పిల్లలు చేసుకుంటారు కాని!" అన్నాడు అహమద్.

"మనం అలా అడిగితే తప్పుగా కూడా ఉంటుంది" అంది జుబేదా.

"రోజులు మారాయి. ఇంకా ఈ పట్టింపులేమిటి? ఏమైనా పిల్లని చూస్తేనే కాని నేను ఒప్పుకోను" అన్నాడు ఇస్మాయిల్ దృఢంగా.

"సరే. అబుల్ ఫజల్‌కి రాస్తాను. అతను నా స్నేహితుడు కనుక అపార్థం చేసుకోకపోవచ్చు" అన్నాడు అహమద్.

ఇస్మాయిల్‌కి ఫాతిమా బాగా నచ్చింది. ఆ విషయాన్ని అబుల్ ఫజల్‌కి చెప్పి తన ఊరికి బయలుదేరాడు.

ఫజల్‌గారు కూడా సంతోషించి అహమద్‌కి ఉత్తరం రాస్తానని చెప్పాడు.


తియ్యని ఊహలతో ఇల్లుచేరాడు ఇస్మాయిల్.

అహమద్, జుబేదా కూడా అబ్బాయికి ఈ సంబంధం నచ్చినందుకు ఎంతో సంతోషించారు.

రెండురోజుల తర్వాత అబుల్ ఫజల్‌గారి దగ్గర్నుంచి అహమద్‌కి ఉత్తరం వచ్చింది. "మీ కుటుంబంతో సంబంధం అంటే- ముందు మా అమ్మాయి సంతోషంగా ఒప్పుకుంది. కాని, అబ్బాయిని చూసి అతనితో మాట్లాడాక- ఈ సంబంధం వద్దని పట్టుపట్టింది. పెళ్ళి విషయంలో నేను బలవంతం చేయలేను కదా... నన్ను అపార్థం చేసుకోరని ఆశిస్తున్నాను" అని!

ఇస్మాయిల్‌కి కన్నీళ్లొక్కటే తరువాయి!

- జనసుధ పత్రిక... *13 ఏప్రిల్ '79*



**ఇబ్బంది ఉండదు**

డైరెక్టర్ : హీరోగారూ... ఇప్పుడు మీరు ఈ నాలుగో అంతస్తు నుంచి కిందకి దూకాలి.

హీరో : అదెలాగండీ... ప్రాణం పోదూ..?

డైరెక్టర్ : మరేం పర్వాలేదు. ఈ సినిమాలో ఇదే చివరి సీనూ.., చివరి షాటూనూ..! అందువల్ల ఏ ఇబ్బందీ ఉండదు.